
ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025 5
పార్వతీపురం మన్యం



అరసవిల్లికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 4న రథసప్తమిని పురస్కరించుకుని పార్వతీపురం డిపో నుంచి అరసవిల్లికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు డిపో మేనేజర్ దుర్గ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యం రథసప్తమినాడు ఉదయం 6, 7 గంటలకు సాధారణ ఛార్జీలతోనే బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.



పార్వతీపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



కొమరాడలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర ద్రోహం

పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్లమెంట్‌లో కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం చేసేదిగా ఉందని సిపిఎం నాయకులు బివి రమణ, గొర్లి వెంకటరమణ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యా సంస్థలైన గిరిజన యూనివర్సిటీ, ఐఐటి, ఎన్‌ఐటి, ట్రిబుల్ ఐటి, కడప ఉక్కు పరిశ్రమకు కనీస కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గతంలో కేటాయించిన కేటాయింపుల కంటే తక్కువ కేటాయించారని, రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైన విశాఖ రైల్వేజోన్‌కు, మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు ఈ బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించాల్సిన కేటాయింపులు కూడా ఈ బడ్జెట్లో చేయలేదని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో ప్రపంచ బ్యాంకు నుంచి ఇచ్చిన అప్పు తప్ప బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి, మౌలిక వసతులు కల్పనకు, నీటి పారుదల ప్రాజెక్టులకు ఎలాంటి కేటాయింపులు కూడా ఈ బడ్జెట్‌లో చేయకపోవడం విచారకరమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసితో సహా ఇతర ఇన్సూరెన్స్ సంస్థలను 100 శాతం ప్రైవేటీకరించేందుకు ఈ బడ్జెట్లో రూపకల్పన చేయడం మరీ దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని ఈ బడ్జెట్‌ను అధికార కూటమి సమర్థించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని అధికార కూటమి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చేలా కేటాయింపులు చేసేందుకు పూనుకోవాలని లేనిచో ఈ ప్రభుత్వం కూడా ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దావాల రమణారావు, ఎం.ఉమా మహేశ్వరి, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని జిల్లేడువలసలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో కేవలం వారికి అనుకూలురైన కార్పొరేట్ వ్యక్తులకు మాత్రమే పనికొచ్చేలా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారని, దీంతో దేశంలో మెజార్టీ వర్గంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఎటువంటి లబ్ధిచేకూరకుండా చేస్తున్నారని విమర్శించారు. పేద ల పై భారాలు వేసి కార్పొరేట్ పెట్టుబడిదారులకు రాయితీలు అందించి వారి మెప్పును పొందుతున్నారని, రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్ర బడ్జెటును రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం సరికాదని అన్నారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు, గెమ్మేల జానకిరావు, బాబాయి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కొమరాడ : కేంద్ర బడ్జెట్ లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేశారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర అన్నారు. స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేశారంటూ నిరసన చేపట్టారు. ఈ నిరసనసనుద్దేశించి వీరు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గొప్పలు మానుకొని రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులు సక్రమంగా కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాలకొండ : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసేదిగా ఉందని సిపిఎం నాయకులు దావాలా రమణారావు విమర్శించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యా సంస్థలైన గిరిజన యూనివర్సిటీ, ఐఐటి ఎన్ఐటి ,ట్రిబుల్ ఐటీ, కడప ఉక్కు పరిశ్రమకు కనీస కేటాయింపులు కూడా ఈ బడ్జెట్ లో చేయలేదని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు గతంలో కేటాయించిన కేటాయింపుల కంటే తక్కువ కేటాయింపులు చేశారని, ఆంధ్ర రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైన విశాఖ రైల్వే జోన్ కు, మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు ఈ బడ్జెట్ లో చేయలేదని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించాల్సిన కేటాయింపులు కూడా ఈ బడ్జెట్లో చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని అధికార కూటమి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చేలా కేటాయింపులు చేసేందుకు పూనుకోవాలని, లేకుంటే ఈ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాదా రాము, దూసి దుర్గారావు, ఎ.భానుచందర్, ఎ.లక్ష్మణరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తీరని 'చింత'

అకాల వర్షాలతో తగ్గిన దిగుబడి
మార్కెట్ ధర లేక విలవిల

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసులు శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో చింతపండు ఒకటి. ఈ ఏడాది అకాల వర్షాలకు పువ్వు రాలిపోవడంతో సగానికి సగం చింతపండు కాపు తగ్గిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సరైన మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు సంతల్లో కావడిలతో తీసుకొచ్చే చింత పండును తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది.

సీతంపేట ఏజెన్సీ చింతపండు అంటే మైదాన ప్రాంత వ్యాపారులు ప్రజలు చెవి కోసుకుంటారు. ఎందుకంటే ఇక్కడ చింతపండు ఎటువంటి రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంతోనే కాపుకు వస్తుంది. ఏజెన్సీలో చింతపండు ఖర్జూరం మాదిరిగా రంగు, పుల్ల పుల్లగా, తీయతీయగా నాణ్యమైంది దొరుకుతుంది. అందుకే మైదాన ప్రాంతంలో పండిన చింతపండు కంటే ఏజెన్సీలో పండిన చింతపండుకు మంచి గిరాకీ పలుకుతుంది. ఏజెన్సీలో సుమారు పదివేల ఎకరాల వరకు ఏటా పంట కాపునకు వచ్చినప్పటికీ ఈ ఏడాది అకాల వర్షాలు కురవడంతో కొంతమేర



సంతకు బుట్టలతో తీసుకొచ్చిన చింతపండు

పంట తగ్గింది. గిరిజనులు సేకరించిన చింతపండు సంతకు తెచ్చి కావిడి లెక్క చొప్పున విక్రయిస్తున్నారు. కావిడి చింత పండు ధర వెయ్యి రూపాయలు పలుకుతుంది. కావిడి చింతపండు కనీసం 30 కేజీల వరకు ఉంటుంది. దీంతో కనీసమద్దతు ధర లేకపోవడంతో గిరిజనులు లబోదిబోమంటున్నారు. బయట మార్కెట్లో మాత్రం కిలో చింతపండు 50రూపాయల పైబడే ఉంటుంది. జిసిసి మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధర కిలో చింతపండు రూ.34 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే గిరిజనులు సీతంపేట, కుసిమి, మర్రిపాడు, పూతికవలస సంతలకు తెచ్చి చింతపండు విక్రయిస్తున్నారు.

దిగుబడి తగ్గింది

గత ఏడాది మీద పోలిస్తే ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గింది. కాపు కొచ్చి పువ్వు పూసిన సమయంలో అకాల వర్షం కురవడంతో పువ్వు రాలిపోయింది.

కొండ గొర్రె రాజశేఖర్ , గిరిజనుడు.

బయట మార్కెట్ మాదిరిగా ధర కల్పించాలి

బయట మార్కెట్ మాదిరిగా ధర కల్పించాలి. ప్రస్తుతం చింతపండు దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో ధర కూడా లేకపోతే ఎలా? ఆదివాసీలకు ఆర్థికంగా చేయూత ఇచ్చేది చింతపండు.

మండంగి లక్ష్మణరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే కొనుగోలు చేస్తున్నాం

ప్రభుత్వం నిర్దేశించిన కిలో 34 రూపాయలు చొప్పున సంతలకు వెళ్లి చింతపండు కొనుగోలు చేస్తున్నాం. ఇంకా ఇప్పుడిప్పుడే ప్రారంభ దశలో ఉంది. ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గింది.

దాసరి కృష్ణ, గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ మేనేజర్

'అడ్డగోలుగా ఉపాధి పనులు'

ప్రజాశక్తి - సాలూరు


నియోజకవర్గ పరిధిలోని సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద అడ్డగోలుగా పనులు జరుగుతున్నాయని జనసేన నాయకులు రేగు మహేష్ చెప్పారు. ఉపాధి హామీ చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపడుతున్నారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల అధికారులే చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో వైసిపి ప్రభుత్వం వెండర్ పదాన్ని జీవోలో చేర్చి జారీ చేసిందన్నారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం అదే దారిలో పయనించడం సరికాదని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు రూ.28 కోట్ల విలువైన బిటి, సిసి రోడ్ల పనులు సుతాపల్లి రాము అనే క్వారీ యజమానికి టిడిపి నాయకులు కట్టబెట్టారని తెలిపారు. ఆయన క్వారీలో తయారైన మెటీరియల్ నాణ్యత లేనిదని, గత ప్రభుత్వ హయాంలో పిఆర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తిరస్కరించారని చెప్పారు. టిడిపి, జనసేనలో మొదటి నుంచి అంకిత భావంతో పని చేస్తున్న నాయకులకు ఉపాధి పనులు కేటాయించలేదని చెప్పారు. సిఎం , డిప్యూటీ సిఎం ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రేషన్ డీలర్ల ఎంపికలో ఎందుకీ తిరకాసు?

అభ్యర్థుల హాల్ టికెట్ల నెంబర్లతో జాబితా విడుదల
పేర్లు బయటపెట్టకుండా జాగ్రత్తపడిన అధికారులు
నేతల అక్రమాలకు యంత్రాంగం వత్తాసు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల చేయడంలో జిల్లా అధికారులు తిరకాసు ప్రదర్శించారు. ఎంపికైన అభ్యర్థుల పేర్లను నేరుగా ప్రకటించకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఎపిపిఎస్సీ, యుపిపిఎస్సీ నిర్వహించిన పరీక్షా ఫలితాలు విడుదల చేసిన చందంగా రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను హాల్ టికెట్ల నెంబర్లతో విడుదల చేయడం విడ్డూరంగా ఉంది. పార్వతీపురం డివిజన్‌లో 36 రేషన్‌డీలర్ పోస్టులకు గతనెల 23న రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 202 మంది పరీక్ష రాశారు. వీరిలో పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారిని ఇంటర్వ్యూకు పిలిచారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను కొద్దిరోజుల క్రితం విడుదల చేశారు. ఈ జాబితాను చూసిన వారు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. 36 రేషన్ డీలర్ పోస్టులకు ఎంపిక చేసిన 36 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తే ఎవరికైనా సూటిగా అర్థమవుతుంది. కానీ అధికారులు మాత్రం హాల్ టికెట్ల నెంబర్లతో జాబితా విడుదల చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ డీలర్ పోస్టుల భర్తీలో అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే ఎంపిక చేశారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారులు ప్రకటించిన జాబితా చూసిన నూటికి నూరు శాతం ఎమ్మెల్యేల సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. డీలర్ పోస్టులను రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని అధికారులు ముందు గొప్పగా చెప్పారు. తీరా జాబితాను పరిశీలించిన తర్వాత ప్రతిభకు పాతరేశారనే ప్రచారం జరుగుతోంది. అధికారపార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులు పొందిన వారికే డీలర్ పోస్టులను కట్టబెట్టారనేది స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక నాయకుల సిఫార్సు మేరకు దండిగా ముడుపులు చెల్లించిన వారికే ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారనేది స్పష్టమైంది. హాల్ టికెట్ల నెంబర్లతో జాబితా విడుదల చేసిన అధికారులు రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కులు, ప్రతిభా పాటవాలను జాబితాలో చూపించలేదు. ఎంపికైన అభ్యర్థుల పేర్లను గోప్యంగా ఉంచడం వెనుక జిల్లా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారనేది తేటతెల్లమైంది. గ్రామాల్లో ఒక్కో డీలర్ పోస్టుకు ఐదు నుంచి పది మంది వరకు పోటీ పడ్డారు. వీరిలో ఒక్కో గ్రామం నుంచి ఇద్దరు లేదా ముగ్గురు వరకు స్థానిక నాయకుల ఒత్తిడి మేరకు ఎమ్మెల్యేలకు పేర్లు అందజేశారు. అయితే ఎమ్మెల్యేలు రాజకీయ పలుకుబడితో పాటు డబ్బులు ఎక్కువ ఇచ్చిన వారికే డీలర్ పోస్టులకు సిఫార్సు చేశారు. గ్రామాల్లో పార్టీ నాయకుల మధ్య అంతరాలు పెరిగిపోకుండా ఉండేందుకు ఎమ్మెల్యేల సూచన మేరకు అభ్యర్థుల పేర్లను జాబితాలో ప్రకటించలేదని తెలుస్తోంది. అధికారులు ప్రకటించిన జాబితాను పరిశీలించిన తర్వాత డీలర్ పోస్టుల భర్తీలో ప్రతిభకు పాతర వేశారనేది రుజువైంది.



వరుస సంఖ్య	మండలం పేరు	గ్రామం పేరు	షాపు నెంబర్	ప్రస్తుత కులం	హాల్ టికెట్ నెంబరు
1	[illegible]	[illegible]	[illegible]	SC	2024121
2	[illegible]	[illegible]	[illegible]	BC-A	2024128
3	[illegible]	[illegible]	[illegible]	SC(W)	2024136
4	[illegible]	[illegible]	[illegible]	OC	2024148
5	[illegible]	[illegible]	[illegible]	BC E	
6	[illegible]	[illegible]	[illegible]	OC	2024019
7	[illegible]	[illegible]	[illegible]	OC	2024022
8	[illegible]	[illegible]	[illegible]	OC	2024001
9	[illegible]	[illegible]	[illegible]	ST	2024003
10	[illegible]	[illegible]	[illegible]	OC	2024014
11	[illegible]	[illegible]	[illegible]	BC-A	2024015
12	[illegible]	[illegible]	[illegible]	BC-D(W)	2024096
13	[illegible]	[illegible]	[illegible]	OC(EWS)	2024103
14	[illegible]	[illegible]	[illegible]	SC(W)	2024108
15	[illegible]	[illegible]	[illegible]	OC(W)	2024179
16	[illegible]	[illegible]	[illegible]	BC-B	2024184
17	[illegible]	[illegible]	[illegible]	ST	2024190
18	[illegible]	[illegible]	[illegible]	OC	2024201
19	[illegible]	[illegible]	[illegible]	BC-E	-

హాల్‌టిక్కెట్ పద్ధతిలో వెల్లడించిన ఫలితాలు



ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోరేడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు కోరారు. ఆదివారం స్థానిక చర్చి గుడి సెంటర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకురాలిగా విజయగౌరి గతంలో చేసిన ఉద్యమాలు, పోరాటాల గురించి అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఇంతవరకు శాసనమండలికి మహిళా ఉపాధ్యాయురాలిని ఎన్నుకోలేదని, ఈ అవకాశాన్ని రెగ్యులర్, కాంట్రాక్టు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఆరేళ్ల ఉపాధ్యాయ సర్వీస్‌ను వదిలి ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి మాట్లాడుతూ చట్టసభల్లో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తడానికి అవకాశం దొరికిందని, ఉపాధ్యాయులంతా గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు, హెచ్‌ఎం, సిఆర్టీ, లెక్చరర్, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నాయకులు గోవిందరావు, సోమేష్, గణపతి, వీరాచారి పాల్గొన్నారు.

18 ఏళ్లుగా కదలని ఏనుగులు

పంటలకు తీవ్ర నష్టం • లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం



ఏజెన్సీలో సంచరిస్తున్న అడవి ఏనుగులు

మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో అడవి ఏనుగులు సమస్య ప్రజలను, రైతులను పట్టిపీడిస్తోంది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అడవి ఏనుగుల సంచారం గ్రామాల్లో, పొలాల్లో ఉండడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. నియోజకవర్గంలో నదీపరివాహ ప్రాంతం ఉండడం, పుష్కరమైన పంటలు ఆహారంగా లభించడంతో ఈ ప్రాంతాన్ని ఆవాస ప్రాంతంగా ఏనుగులు ఏర్పర్చుకున్నాయి. గత 18 ఏళ్లుగా అడవి ఏనుగుల సమస్య ఉన్నా అటు ప్రభుత్వం గానీ, ఇటు అధికారులు గానీ రక్షణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రతిరోజు ఏదో ఒక ఊరి లోకి చొరబడి పంటలను, ఆస్తులపై దాడి చేసి తీవ్ర నష్టం కలిగించడం ఏనుగుల సమస్యతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఇప్పటికే ఏనుగు దాడిలో 18 మంది వరకు మృత్యువాతపడ్డారు. వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కుంకీ ఏనుగులను తీసుకువచ్చి అడవి ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపుతామని ప్రభుత్వం ప్రకటించినా చర్యలు మాత్రం కానరాలేదు. మొన్న కొమరాడ మండలంలో పామాయిల్ తోటను, నిన్న కురుపాం మండలంలో కర్బూజా పంటను, నేడు జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలో రైస్‌మిల్‌పై అడవి ఏనుగులు గుంపు నాశనం చేశాయి. చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాత్రి సమయాల్లో ఫారెస్ట్ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్లు లేకపోవడంతో ఎక్కువ ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అడవి ఏనుగుల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు.

నేడు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొండ



వారం రోజులు నుంచి నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠం నెలకొంటుంది. 20 వార్డు సభ్యులకు గానూ 17 మంది వైసిపికి ఉండగా ముగ్గురు టిడిపి చెందినవారు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు నాలుగో వార్డు కౌన్సిలర్ గంగ నాయుడు జనసేన కండువా పుచ్చుకున్నారు. అయితే ఇటీవల కాలంలో 19వ వార్డు కౌన్సిలర్ రాధా కుమారి వ్యక్తిగత కారణాలతో చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో వైసిపికి చెందిన వైస్ చైర్మన్-2 పల్లా ప్రతాప్‌కు ఆ పదవి వరించింది. అయితే చైర్మన్ ఎస్సీకి రిజర్వ్ చేయడంతో రెండో వార్డు వైసిపికి చెందిన కౌన్సిలర్ ఆకులు మల్లేశ్వరికి ఈ పదవి వరిస్తుందని అంతా భావించారు. సోమవారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పురపాలక సంఘాలు, నగర పంచాయతీలో చైర్మన్లు, వైస్ చైర్మన్ ఎన్నిక జరపాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే నాలుగు రోజుల క్రితం రెండో వార్డ్ కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి, ఆమె భర్త కుమార్ ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో పసుపు కొండువా కప్పుకున్నారు. దీంతో రాజకీయాలు రసవంతంగా మారాయి. ఇన్‌ఛార్జి మంత్రికి కూటమి ఎమ్మెల్యే జయకృష్ణతో విభేదాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. దీంతో ఇక్కడున్న టిడిపి కౌన్సిలర్లు కూడా మల్లేశ్వరికి మద్దతు తీస్తారా లేదా చూడాల్సి ఉంది. వైసిపి అధినాయకత్వం విప్ జారీ చేయడంతో ఆకుల కుమారి నామినేషన్ దాఖల చేయడానికి కూడా వీల్లేదని వైసిపి వర్గాలు చెప్తున్నాయి. ఇదిలా ఉండగా 19వ వార్డులో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన స్వర్ణకుమారి కోర్టులో పిల్ కూడా వేయడం జరిగింది. 19వ వార్డులో కౌన్సిలర్ ఎన్నిక జరగకుండా చైర్మన్ ఎన్నిక జరపొద్దని కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. అయితే చైర్మన్‌గా ఆకులు మల్లేశ్వరి అవుతారా లేదా వైస్ చైర్మన్ 2 ప్రతాప్ చైర్మన్‌గా కొనసాగుతారా అన్నది చూడాల్సి ఉంది. పట్టణం లో దీనిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, అంగన్వాడీ, మున్సిపల్ తదితర కార్మికులను తొలగించేందుకు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ప్రయత్నించడం, దానికి అధికార యంత్రాంగం తోడ్పడడం సరైన విధానం కాదని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ విమర్శించారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గత కొన్నేళ్లుగా మధ్యాహ్నం భోజనం పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందిన కార్మికులను తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అధికారులను పురిగొల్పడం సరైన విధానం కాదని విమర్శించారు. ఉపాధి కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు ఉపాధి తీసివేసేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వైఖరితో ఇప్పటికే పార్వతీపురం పట్టణంలో వివిధ వర్గాల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తోపుడు బండ్లు, చిల్లర వర్తకులపై పోలీసుల్ని ఉసిగొల్పి తీవ్ర ఇబ్బందులకు గురిచేసినట్లు తమ దృష్టికి వచ్చిందని నాయకులు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్వాడీలపై కూడా వేధింపులకు పాల్పడుతున్నారని ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా కార్మికులను చిరుఉద్యోగులను తొలగించే ఈ ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని విమర్శించారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే కార్మికులందర్నీ ఐక్యం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


కవిటిపల్లిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా?
ఫ్లెక్సీలు తొలగించని వైనం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీలకు జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే మండలంలో మాత్రం అధికారులకు ఎన్నికల కోడ్ పట్టినట్లు కనిపించడం లేదు. దీంతో రాజకీయ నేతల ఫ్లెక్సీలు ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తున్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం వల్ల విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత రాజకీయ ఫ్లెక్సీలు ఉండకూడదని, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానికంగా అధికారులు బేఖాతరు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా మండలంలోని కవిటిపల్లిలో వెలసిన ఫ్లెక్సీలే. కవిటిపల్లిలో ఆదివారం జరిగిన నిర్మించిన ముత్యాలమ్మ గుడి ప్రారంభోత్సవంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె రాక సందర్భంగా గ్రామంలో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు వెలిశాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇలా ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ కనిపించడంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్కు ఎన్డిఎ కూటమి ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపిందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీహార్, ఏపీలకు ఎంపీల మద్దతుతోనే ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతోందని చెప్పారు. అయితే బీహార్ సిఎం నితీష్కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి నిధులు సాధించుకున్నారని చెప్పారు. మరి ఏపికి ఎలాంటి కేటాయింపు లేకపోయినా సిఎం చంద్రబాబు నాయుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుంటే కూటమి పార్టీలు ప్రశ్నించడం లేదని రంజిత్ కుమార్ ఆ ప్రకటనలో ఆరోపించారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పద్యాలు, గద్యాలు, క్రీడా పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన రావు మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలు రకాల పుస్తకాలను సిద్ధం చేశామని, వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారని మధుసూదనరావుతెలిపారు.


వీరఘట్టంలో చేపట్టి యోగా ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

యోగాతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

యోగాతోనే ఆరోగ్యమని పాలకొండ రిషియోగా విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు అన్నారు. ఆదివారం వీరఘట్టంలో యోగ శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి ఆరోగ్యం యోగాతోనే సుసాధ్యమని, ప్రతి ఒక్కరూ యోగా తరగతుల్లో పాల్గొని మీ ఆరోగ్యం మెరుగుపర్చుకోవాలని అన్నారు. మీకోసం ఉచితంగా యోగా తరగతులు ప్రారంభించామని, ప్రతి ఒక్కరూ ఇందులో చేరి ఆరోగ్యంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వి శ్రీనివాసరావు, సూర్యచంద్రరావు, చిట్టి, తదితరులు పాల్గొన్నారు.


గిరిజన నిరుద్యోగులకు సివిల్స్ కోచింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధి ఉమ్మడి జిల్లాలో గల గిరిజన విద్యార్థులకు, నిరుద్యోగులకు, డిగ్రీ పట్టా పొందిన నిరుద్యోగులకు ఉచితంగా సివిల్స్ ఉచిత శిక్షణ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్ కోరారు. గిరిజన విద్యార్థులకు పాడేరు ఐటిడిఎ పరిధిలో శిక్షణ ఇస్తున్నారని, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఇంతవరకు గిరిజన యువతకు ఎటువంటి ఉపాధి శిక్షణ కూడా ఇవ్వడం లేదని అన్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటిసి కేంద్రాలు దిష్టి బొమ్మలా ఖాళీగా ఉన్నాయని, అధికారులు స్పందించి ఐటిడిఎ ఆధ్వర్యంలో వైటిసి కేంద్రాల్లో నిరుద్యోగులకు ఉపయోగపడే శిక్షణ ఇవ్వాలని కోరారు.

కోడూరుకు తెలంగాణ సాంస్కృతిక అవార్డు

ప్రజాశక్తి - సాలూరు



పట్టణానికి చెందిన కవి, రచయిత కోడూరు సాయి శ్రీనివాస రావును తెలంగాణ సాంస్కృతిక సంస్థ తెలంగాణ కళారత్నాలు సంస్థ బంగారు నంది అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 9న హైదరాబాద్లో గల త్యాగరాజ భవన్లో కోడూరు సాయి శ్రీనివాసరావుకు ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ ఆవార్డుకు సాయి శ్రీనివాసరావు ఎంపిక కావడంపై డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, బ్యాంక్ కార్యదర్శి బి.వేణుగోపాలరావు, ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు హర్షం వ్యక్తంచేశారు. సాయిశ్రీనివాసరావు గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచి అవార్డులు అందుకున్నారు.

రబీలో ఎటిఎం పద్ధతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బాలేసు పంచాయతీ రేగడిలో ఆదివారం ఆర్వైఎస్ఎస్ ఆధ్వర్యంలో నిమ్మక ఆసమ్మ, నిమ్మక కాంతమ్మ పొలాల్లో రబీ సాగులో భాగంగా వరి వీడింగ్, ఎద పంటగా పొలం గట్టుచుట్టూ బంతి, తీగజాతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్వైఎస్ఎస్, యూనిట్ ఇన్ఛార్జి మండంగి సీతారాం మాట్లాడుతూ వీడింగ్ వల్ల కలుపు నివారణ, భూమి సారవంతంగా తయారై పంట అధిక దిగుబడిని ఇస్తుందని అన్నారు. అంతేకాకుండా పొలం గట్టు చుట్టూ ప్రతి రైతు బంతి, తీగజాతి వంటి మొక్కలు ఎర పంటగా వేసుకోవాలని అన్నారు. ఇలా వేసుకోవడం వల్ల పంటను నాశనం చేసే క్రిమికీటకాలబారి నుంచి రక్షించుకొని అధిక పంట దిగుబడి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమానికి ఐసిఆర్పిలు బిడ్డిక కోటేశ్వరరావు, కృష్ణారావు, యామిని, రైతులు పాల్గొన్నారు.


ఎటిఎం పద్ధతితో రబీవరి సాగు చేస్తున్న రైతులు

పాడి రైతుల జీవనోపాదులను దెబ్బతీస్తూ విశాఖ డెయిరీ తీసుకుంటున్న నిర్ణయాలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ ప్రాంత రైతన్నలు పాడి పశుపోషణ జీవనాధారంగా ఎంచుకొని పాల అమ్మకాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరికి అండగా విశాఖ డెయిరీ ముందుకు వచ్చి దశాబ్దాల కాలంగా గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆడారి తులసీరావు డెయిరీ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించి అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. రైతులకు విద్య, వైద్య, ఉద్యోగాల కల్పన కోసం ట్రస్ట్ ఏర్పాటు చేసి డెయిరీని లాబాల బాటలో నడిపించారు. అయితే తులసీరావు మరణం తరువాత వీరి కుమారుడు ఆనంద్ కుమార్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి.



విశాఖ డెయిరీ దాంగదెబ్బ

- పాడి రైతులను కుంగదీస్తున్న యాజమాన్యం
- సేకరించిన పాలను మార్కెట్ చేసుకోలేకపోతున్న పాలక వర్గం
- పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలపై ఆంక్షలు
- కోర్టులను ఆశ్రయిస్తామంటున్న రైతులు
- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - రామభద్రపురం

విశాఖ డెయిరీ పరిధిలో 3.80 లక్షల మంది పాల రైతులున్నారు. డెయిరీ నిర్ణయాలతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు. రామభద్రపురం మండలంలోని 70 సంఘాల పరిధిలో 5 వేల మంది పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు సభలు, సమావేశాలు, నిరసన ర్యాలీలు నిర్వహించి డెయిరీ నిర్ణయాన్ని ఎండగడుతూ పాల ధరలు పెంచాలని, ఏటా రెండుసార్లు బోనస్లు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. డెయిరీలో అవినీతి రాజ్యమేలుతుందని, నిధులు గోల్ మాల్ అయ్యాయని అందుకే నష్టాలు సాకు చూపి పాల ధరలు అమాంతం తగ్గించారని నిరసనలు వెల్లువెత్తాయి. దీనికి తోడు డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా వారి సమస్యలపై గలమెత్తి నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరిగి ప్రభుత్వం సభా సంఘాన్ని ఏర్పాటు చేసి ఒక కమిటీ కూడా వేసింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో పలు విచారణలు కూడా జరిగాయి. అయితే అనూహ్యంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, పాలక వర్గం కూటమి ప్రభుత్వాన్ని ఆశ్రయించి బీజేపీలో చేరడం గమనార్హం.

తాజాగా రైతు నెత్తిపై మరో పిడుగు

ఇప్పుడు తాజాగా రైతు నెత్తిపై మరో పిడుగు పడింది. పాలను మార్కెట్ చేయలేక పోతున్నామని, పాల సేకరణ తగ్గించుకోవాలని లేదంటే వారానికి ఒక రోజు పాల సేకరణ నిలుపుదల చేస్తామని, నాణ్యత లేని పాలు తిరిగి పంపి వేస్తామని హెచ్చరికలు జారీ చేస్తూ పాలక వర్గం సభ్యులు రైతన్నకు సమాచారం అందించారు. విశాఖ డెయిరీని నమ్ముకొని పశువుల్ని పోషిస్తున్న రైతుకు ఈ చేదు సమాచారం పాడిపై పెంచుకున్న ఆశలు నిరాశ అయ్యేలా చేసింది. పూటకు 30 లీటర్లు ఆవు పాలు 10 లీటర్ల గేదే పాలు ఉండాలని, వెన్న శాతం ఆవు3, గేదె 5 శాతం ఉంటూ ఎస్ఎన్ఎఫ్8.8.20గా లేకపోతే ఆ పాలు తిరిగి సేకరణ కేంద్రాలకే పంపివేస్తామని సంబధిత డెయిరీ అధికారులు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే పాడి పశువు ఆరోగ్యం, ఈనిక కాలం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వెన్న శాతంలో హెచ్చు తగ్గులు రావడం సహజం. గతంలో ఇలా వస్తే ధర తగ్గించి లేదా పెనాల్టీ ధరతో పాలను తీసుకొనేవారు. ఇప్పుడు సేకరించి పంపిన పాలు నాణ్యతా ప్రమాణాలు పేరుతో తిరిగి వెనక్కి పంపించడం సంఘాలను నిర్వీర్యం చేసే కుట్రగా పలువురు రైతులు విమర్శిస్తున్నారు. అలా పంపిన పాలు వినియోగానికి పనికి వచ్చే సమయం దాటిన తరువాత వస్తాయని మరల ఆ పాలను రైతుకు ఎలా ఇవ్వగలం అని సేకరణ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘ బైలా నిబంధనల మేరకు కోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని పలువురు రైతులు హెచ్చరిస్తున్నారు. అత్యధిక లాభాల బాటలో ఉన్న డెయిరీని నష్టాల ఊబిలోకి నెట్టి రైతుల జీవనోపాదులు దెబ్బతీసే కుట్రలు మానుకోవాలని రైతు శ్రేయస్సుకు పాత పద్ధతిలోనే పాల సేకరణ జరపాలని, తగ్గించిన ధరలు పెంచాలని సంక్షేమ కార్యక్రమాలు శత శాతం అమలు చేయాలని ప్రజాసంఘాలు, పలువురు రైతులు కోరుతున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

సీతానగరం : విశాఖ డైరీకి పాలు సరఫరా చేస్తున్న పాల రైతులకు ఆవు పాల ధరను 10 శాతం తగ్గించి తీసుకుంటామని, డైరీ యాజమాన్యం పేరుగాని, హోదా గాని లేకుండా తగ్గింపు ధర సర్క్యులర్ను చూపించి లీటరుకు తక్కువ ధర లెక్కకట్టి సిబ్బంది తమ చేతివాటం చూపి పాల రైతులను మోసం చేస్తున్నారని దీనిపై ఈ నెల 3న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకవర్గం డైరీ అభివృద్ధి కోసం కాకుండా తమ సొంత అభివృద్ధి కోసం పని చేస్తున్నారని రైతులంతా అప్రమత్తంగా ఉండి పాలక వర్గం నుంచి విశాఖ డైరీని కాపాడుకోవడానికి పాల రైతులంతా ధర్నాలో పాల్గొవాలని పిలుపునిచ్చారు.

ప్రత్యక్ష రాజకీయాలతో రైతులకు అవస్థలు

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగి మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. వేల కోట్ల లాభాల్లో ఉన్న డెయిరీ నష్టాల్లో ఉన్నట్లు ప్రకటించారు. అయితే డెయిరీ ఆస్తులు, లాభాలు సొంతానికి వాడుకొని ఎన్నికల్లో ఆ సొమ్ము వినియోగించడమే నష్టాలకు కారణం అని కొందరు చెబుతున్నారు. దీనికి ఊతమిస్తూ పాల సేకరణ ధర రూ.5 నుంచి 10 రూపాయలు తగ్గించడంతో, ఇప్పటికే పాలకు గిట్టుబాటు ధర లేక దానా ఖర్చులకే పాల రాబడి సరి పోవడం లేదని భావిస్తున్న రైతు నెత్తిన పిడుగు పడినట్లయ్యింది.

ఏజెన్సీని కప్పేసిన మంచు

- ఉదయం 9గంటల వరకు కురిసిన భారీ మంచు
- వాహన రాకపోకలు తీవ్ర అంతరాయం
- జీడి, మామిడి పూత దెబ్బతింటుందని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కురిసింది. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్పేట పరిసర ప్రాంతాల్లో, ప్రధాన రహదారిపై ఉదయం 8గంటల వరకు కురిసిన దట్టమైన మంచు కురుసింది. మంచు ప్రభావంతో వాహనరాకపోకలకు ఇబ్బందిగా మారింది. విద్యుత్ లైట్లతో అతి దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనిపించని పరిస్థితి. గుమ్మలక్ష్మీపురంలో పెట్రోల్ బంకు, రహదారులు మంచు ప్రభావంతో సూర్యుని వెలుగు వచ్చే వరకు మంచు వాకిట్లో ఉన్నాయి. ఫిబ్రవరి ప్రారంభంలో ఇంత పెద్ద ఎత్తున దట్టమైన మంచు కురవడం తొలిసారని ప్రజలు అంటున్నారు. పొగ మంచు కురిసే సమయంలో బయట తిరిగితే తలనొప్పి, జలుబు లక్షణాలు వ్యాప్తి చెందుతాయని వైద్యులు సూచిస్తున్నారు.

కురుపాం : నియోజకవర్గం కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గిరిజన గ్రామాలను గత నాలుగు రోజుల నుంచి పొగమంచు కప్పేస్తుంది. క్రమంగా చలి తగ్గుముఖం పడుతున్నా పొగ మంచు ముసుగులో రహదార్లు మూసుకు పోతున్నాయి. ప్రధాన రోడ్లన్నీ దట్టమైన పొగమంచుతో నిండిపోవడంతో వాహనాలు దగ్గరకు వస్తే తప్ప కనిపించని పరిస్థితి ఎదురవుతుంది. దీంతో తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సిన వారు హైడ్లైట్లు వేసుకొని వాహనాలను నడపాల్సిన పరిస్థితి వస్తుంది. ఉదయం 9 గంటల వరకు ఈ పరిస్థితి రావడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. పొగమంచు మూలంగా జీడి, మామిడి పూత దెబ్బతింటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎక్కువ రోజులు పొగమంచు కురిస్తే పూత దెబ్బతిని మామిడి ,జీడి దిగుబడి దెబ్బతింటుందని రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. పొగమంచు ఎక్కువగా ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిదని, తప్పని పరిస్థితి ఎదురైతే చాలా నెమ్మదిగా వెళుతూ, హైడే డ్లైట్లు వినియోగించాలని పోలీసులు చెబుతున్నారు.

సీతానగరం : పొగ మంచుతో ప్రయాణాకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కురవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు గురయ్యారు. అంతేకాకుండా ఈ పొగ మంచితో మామిడి, జీడి పూతలు పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఏజెన్సీలో కురుస్తున్న మంచు


మంచు ప్రభావంతో రాలిపోయిన జీడి పూత

వాహనదారులందరికీ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కురుపాంలో గల ఎర్రచెరువు ప్రధాన రహదారి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించి ఇంతవరకు అపరాద రుసుం ఉంటే కట్టిన వారికి వెంటనే కట్టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ మద్యం సేవించకుండా అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మత్తు పదార్థాలు, ఆన్లైన్ మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు స్థానిక అజ్జాడ బస్స్టాప్ వద్ద యువతను ఉద్దేశించి గంజాయి, డ్రగ్స్కు బానిసవుతున్నారని, దీనిపై, ఆన్లైన్లో జరిగే ఆర్థిక మోసాలపై డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. గంజాయి బారిన పడిన యువత ఎలా చెడిపోతున్నారన్నారు. ఆన్లైన్ / సైబర్ నేరాలు గురించి వీడియోలు ప్లే చేశామని అన్నారు. సైబర్ నేరాలు, గంజాయి మరియు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే మహిళలు విడిగా వెళ్లేటప్పుడు, అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ సందర్భంగా వివరించారు. ఎటువంటి అనుమానం వచ్చినా పోలీసులు హెల్ప్లైన్కు ఫోన్ చేయాలని ఆయన మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు, కానిస్టేబుల్ నరేష్, మహిళా కానిస్టేబుల్ పద్మ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు


కురుపాంలో వాహనచోదకుల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

సెల్టవర్ ఎక్కి గుర్తుతెలియని వ్యక్తి హల్చల్

ప్రజాశక్తి - కురుపాం

గుర్తు తెలియని వ్యక్తి మద్యంసేవించి సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేసిన సంఘటన జియ్యమ్మవలస మండలం పిటి మండలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాడని నన్ను దించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే దూకేస్తానని హిందీలో బెదిరిస్తూ, హల్చల్ చేస్తూ వీరంగం సృష్టిస్తున్నాడని తెలిపారు. ఎంతసేపు ప్రయత్నించినా దిగకపోవడంతో పోలీసులకు సమాచారం అందిం చామని, వెంటనే జియ్యమ్మవలస ఎస్సై ప్రశాంత్ కుమార్ టవర్ వద్దకు చేరుకొని దించివేశారు. ఆ వ్యక్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.


సెల్టవర్పై ఉన్న వ్యక్తి (ఇన్సెట్లో)

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్వేర్ ఇంజినీర్ మృతి

ప్రజాశక్తి- భోగాపురం

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో మిరాఖిల్ సాఫ్ట్వేర్ కంపెనీలో ఇంజినీర్గా పనిచేస్తున్న యువతి మృతి చెందింది. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. ముంజేరు సమీపంలోని మిరాకిల్ సాఫ్ట్వేర్ కంపెనీలో అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన రొంగళి లీలా (23), పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన అడపాక శివ గణేష్ సాఫ్ట్వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై తగరపువలస వెళ్లారు. తగరపువలస నుంచి తిరిగి వస్తున్న సమయంలో పోలిపల్లి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో లీల అక్కడికక్కడే మృతిచెందగా శివ గణేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తగరపువలసలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ ఎన్ వి ప్రభాకర్ తెలిపారు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సమిష్టిగా శ్యామలాంబ పండగ : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

శ్యామలాంబ అమ్మవారి పండగను అంతా కలిసికట్టుగా సమిష్టిగా నిర్వహించుకుందామని గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం స్థానిక శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో ధర్మకర్తల మండలి ఉత్సవ కమిటీ పట్టణ ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 14 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న శ్యామలాంబ అమ్మవారి పండగను పట్టణ ప్రజలంతా కలిసి సమిష్టిగా నిర్వహించుకుందామన్నారు. భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ పండగను ఈ ఏడాది మేలో నిర్వహించేందుకు పెద్దలంతా కలిసి నిర్ణయించారని అన్నారు. పండగలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో అనువంశిక ధర్మకర్త యువరాజు, మాజీ ఎమ్మెల్యే ఆర్పి భంజుదేవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు అక్కేన అప్పారావు, మున్సిపల్ చైర్మైన్ మాజీ జర్జాపు ఈశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, నాయకులు సిగడాపు బంగారయ్య, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.


ఎఎస్పి దిలీప్కిరణ్ను సన్మానిస్తున్న ఎస్పి మాధవరెడ్డి, ఎఎస్పి అంకిత సురానా

ఎఎస్పి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎఎస్పిగా పార్వతీపురం మన్యం జిల్లాకు డాక్టర్ దిలీప్ కిరణ్ చేసిన సేవలు మరువలేనివని ఎస్పీ ఎస్ మాధవ్ రెడ్డి అన్నారు. బదిలీపై విజయవాడ వెళ్తున్న అదనపు ఎస్పీకి స్థానిక లయన్స్ క్లబ్లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలోనూ, పరిపాలనలో ఎఎస్పి సహాయ సహకారాలు అందించారన్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఎఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఎటువంటి సౌకర్యాలు లేని సమయంలో ఎన్నో ప్రయాసలకు ఒడ్డి నేడు జిల్లా పోలీసు కార్యాలయం, పాలనా వ్యవస్థను ఒకతాటిపైకి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని కితాబు పలికారు. అనంతరం ఎఎస్పీ దిలీప్ కిరణ్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇంతకాలం వరకు జిల్లాలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఈ మూడేళ్లలో ప్రతి ఒక్కరూ అహర్నిశలు కష్టపడి తనకు స్ఫూర్తిదాయకమైన విజయాన్ని అందించారు. అదనపు ఎస్పీగా నేను ఇచ్చిన సూచనలు పాటిస్తూ పోలీసు వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడంలో కృషి చేసిన అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి కతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఈ మధురానుభూతిని తన జీవిత కాలంలో మరిచిపోనని, తనతో నడిచిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో ఒక మంచి అవకాశం దక్కినప్పుడు తిరిగి మళ్లీ మీతో పని చేసే సందర్భం తప్పకుండా వస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎఎస్పి అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి బత్తిన మోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు వి.దాలి నాయుడు, కోలా కిరణ్, సాయి శ్రీనివాస్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి నాయకుల చేతకానితనం వల్లే కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి మిగిలిందని విమర్శించారు. నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించే ప్రస్తావన లేకుండా, తలసరి ఆదాయం మార్గాలు చూపించకుండా వినియోగస్థాయి పెంచుతాం అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ బడ్జెట్ సామాన్యులకు శాపంగా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఇచ్చే ప్రాధాన్యత సామాన్యులకు లేదన్నారు. విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిశ్రమకు, రైల్వే జోన్ కు సహాయం, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ సెంట్రల్ యూనివర్సిటీ తదితరవాటి కి మొండిచేయ మిగిలిందన్నారు. ఎప్పుడైతే విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులను దేశంలో తయారు చేసుకునేలా బడ్జెట్ రూపకల్పన జరుగుతుందో అప్పుడు విదేశాలకు పెద్ద మొత్తంలో ద్రవ్యం చెల్లించాల్సిన అవసరం ఉండదు అన్నారు. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఆంధ్ర ప్రజలపై నీళ్లు చల్లినట్లు అయిందన్నారు.


ప్రమాదానికి గురైన కారు ; మృతిచెందిన ఉపాధ్యాయిని సౌజన్య(ఇన్సెట్లో)

ప్రాణం తీసిన పొగమంచు
రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పొగమంచు కారణంగా ఓ ప్రాణం పోయింది. మండలంలోని కనిమెట్ట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం మండలం పోలిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని కింగువ భవాని (45) మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం...

పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సౌజన్య భోగాపురం మండలం పోలిపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని పిఎంపాలెంలో నివాసముంటున్నారు. కింగువ సౌజన్య (45) భర్త కింగువ రవి, కుమారుడు ఉదయ్, కుమార్తె హన్సిక, ఆమె తల్లి భోగి భవానితో కలిసి గత నెల 27న కారులో కుంభమేళాకు వెళ్లారు. అనంతరం ఈ నెల ఒకటో తేదీ స్వస్థలానికి ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం తెల్లవారి పూసపాటిరేగ మండలం కనిమెట్ట దగ్గరికి వచ్చేసరికి జాతీయ రహదారిపై శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొంది. డ్రైవర్ ప్రసాద్ వెనుక భాగంలో కూర్చున్న సౌజన్యకు తీవ్రగాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే 108 వాహనంలో విజయనగరం తరలించారు. ఆదివారం తెల్లవారుజామున విపరీతంగా పొగమంచు కురిసింది. దీంతో ముందు వెళ్తున్న వాహనం కనిపించక పోవడంతో కారు ఢీకొన్నట్లు భావిస్తున్నారు. ఆమె భర్త రవికుమార్ విశాఖపట్నంలోని ప్రయివేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు.